పరీక్షల్లో ఇబ్బందుల్లేకుండా చూడాలి

- జిల్లామాధ్యమిక అధికారి జాదవ్ పరశు రామ్

దిలావర్‌పూర్ : దిలావర్‌పూర్‌లోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఇంటర్ ప్రాక్టికల్స్‌ను పరిశీలిస్తున్న జిల్లా మాధ్యమిక అధికారి

దిలావర్‌పూర్ ఫిబ్రవరి 3 : ఇంటర్ పరీక్షల్లో విద్యార్థులకు ఇబ్బందులు లేకుండా చూడాలని జిల్లా మాధ్యమిక అధికారి, ఇంటర్ బోర్డు సభ్యుడు జాదవ్ పరశురామ్ సూచించారు. సోమవారం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో జరుగుతున్న ఇంటర్ ద్వితీయ సంవత్సరం వొకేషన్ ప్రాక్టికల్స్‌ను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ప్రాక్టికల్స్‌ను జరుగుతున్న తరగతులను ఆయన పరిశీలించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, పరీక్షల కోసం విద్యార్థులు సిద్ధం కావాలని, పరీక్షల్లో మంచి ఫలితాలు సాధించి కళాశాల, తల్లిదండ్రులకు మంచి పేరుతీసుకొని రావాలని సూచించారు. విద్యార్థులకు ఇబ్బందులకు ఇబ్బందులు లేకుండా చూడాలని కళాశాల చీఫ్ సూపరింటెండెంట్‌కు సూచించారు. ఇక్కడ ప్రిన్సిపాల్ సుదర్శన్ తదితరులున్నారు.

భైంసా, ఫిబ్రవరి, 3 : పట్టణంలోని సాంఘీక సంక్షేమ గురుకుల కళాశాలను ఇంటర్మీడిట్ విద్యాధికారి పరుశురాం సందర్శించారు. ద్వితీయ సంవత్సరంకు సంబంధించిన ప్రాక్టికల్స్ పరీక్షలు ప్రారంభమవడంతో పరిశీలించారు. ఆయన వెంట జిల్లా పరీక్షల విభాగం కమిటీ మెంబర్ సునీల్, ప్రిన్సిపల్ సుమలత, తదితరులున్నారు.

జాతీయస్థాయి క్రీడల్లో రాణించాలి

తాడిహత్నూర్‌లో ఆటల పోటీల నిర్వహణకు ఆర్థిక సహాయం చేస్తున్న ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్

నార్నూర్, ఫిబ్రవరి 3: గ్రామీణ క్రీడాకారులు జాతీయ స్థాయి పోటీల్లో రాణించాలని ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్ ఆకాంక్షించారు. సోమవారం మండలంలోని తాడిహత్నూర్ గ్రామంలో నిర్వహించిన క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించారు. క్రికెట్ నిర్వహణకు తన వంతు ఆర్థిక సహాయం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, యువత క్రీడలతోపాటు ఉన్నత చదువులతో ప్రయోజకులు కావాలని సూచించారు. ఇక్కడ మాజీ సర్పంచ్ రాథోడ్ మధూకర్, సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్, కోఆప్షన్ సభ్యుడు ఉదయ్‌కాంబ్లే, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేశ్, క్రీడాకారులున్నారు.

టీబీ హరేగా. దేశ్ జీతేగా : కలెక్టర్ రాజర్షి షా

ప్రతిజ్ఞ చేస్తున్న కలెక్టర్, అధికారులు, వైద్యులు

ఎదులాపురం, ఫిబ్రవరి3: టీబీ హరేగా..దేశ్ జీతేగా ..అని కలెక్టర్ రాజర్షి షా అన్నారు. టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం కలెక్టరేట్ సమావేశం మందిరంలో టీబీ నిర్మూలన వంద రోజుల కార్యక్రమాన్ని కలెక్టర్ రాజర్షి షా అధ్యక్షతన నిర్వహించారు. ముందుగా టీబీ నిర్మూలనపై సమీక్షా నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, క్షయ వ్యాధిని నిర్మూలించడానికి ప్రజలలో టీబీపై అవగాహన కల్పించేందుకు ప్రతి ఒక్కరూ కృషిని చేయాలన్నారు. అనంతరం టీడీసీవో డాక్టర్ సుమలత జిల్లా అధికారులతో ప్రతిజ్ఞ చేయించారు. ఇతర శాఖలతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఇక్కడ అదనపు కలెక్టర్ శ్యామలాదేవి, ఆర్డీవో వినోద్‌కుమార్, అధికారులున్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

గుంజాల గ్రామంలో బాధిత కుటుంబాలకు ఆర్థిక సాయం అందిస్తున్న ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్

నార్నూర్, ఫిబ్రవరి 3: ఆదిలాబాద్ జిల్లా నార్నూర్ మండలం గుంజాల గ్రామానికి చెందిన మాజీ సర్పంచ్ కుమ్ర సావిత్రిబాయి, గిరే సోను ఇటీవల మృతి చెందగా ఇంద్రవెల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ శ్రీరామ్ జాదవ్ బాధిత కుటుంబాలను సోమవారం పరామర్శించారు. మాజీ సర్పంచ్ సావిత్రిబాయి, గిరే సోను మృతికి కారణాలను కుటుంబీకులను అడిగి తెలుసుకొని ఆర్థిక సాయం అందించారు. ఇక్కడ నార్నూర్ సహకార సంఘం చైర్మన్ ఆడే సురేశ్, వక్ఫ్ బోర్డ్ మాజీ చైర్మన్ యూన్సీ అక్బానీ, సహకార సంఘం కోఆప్షన్ సభ్యుడు ఉదయ్ కాంబ్లే, మాజీ ఎంపీటీసీ రాథోడ్ రమేశ్, మాజీ సర్పంచ్ తనయుడు కుమ్ర జ్ఞానేశ్వర్ తదితరులున్నారు.

లారీని విక్రయించిన ఒకరిపై కేసు

ఎదులాపురం, ఫిబ్రవరి 3 : ఆదిలాబాద్ పట్టణంలోని క్రాంతినగర్‌కు చెందిన సోహెల్ ఖాన్‌కు చెందిన లారీని ఆయనకు తెలియకుండా విక్రయించిన అబ్దుల్ హకీమ్‌పై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ కరుణాకర్ రావ్ తెలిపారు. సీఐ తెలిపిన వివరాల ప్రకారం.. సోహెల్ ఖాన్ బొక్కల్‌గూడకు చెందిన అబ్దుల్ హకీమ్‌కు మూడు నెలల క్రితం అగ్రిమెంట్ ద్వారా రూ.19 లక్షలకు లారీ విక్రయించాడు. దానికి సంబంధించిన రూ.4 లక్షల డబ్బులు ఇవ్వాల్సి ఉందని, మిగితా రూ.15 లక్షలు బ్యాంక్ ఈఎంఐ చెల్లించాల్సి ఉందని పేర్కొన్నారు. మూడు నెలల నుంచి ఆయన కనిపించకుండా పోయాడని, ఆ లారీని ఇతరులకు విక్రయించినట్లు తెలిపారు. తనకు ఇవ్వాల్సిన డబ్బులు ఇవ్వకపోగా, బ్యాంకులో కిస్తీలు చెల్లించడం లేదని బాధితుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి అరెస్టు చేసినట్లు వివరించారు.

కేంద్ర బడ్జెట్ పత్రాల దహనం

ఖానాపూర్‌లో కేంద్రం ప్రవేశపెట్టిన బడ్జెట్ పత్రాలను దహనం చేస్తున్న సీపీఎం నాయకులు

ఖానాపూర్, ఫిబ్రవరి 3: ఈ నెల 1న నరేంద్ర మోడీ కేంద్ర ప్రభుత్వ బడ్జెట్ సమావేశంలో ప్రవేశపెట్టిన బిల్లులో రాష్ట్ర వ్యవసాయ రంగానికి, కార్మికులకు తీవ్ర నష్టం జరిగిందని సీపీఎం పార్టీ నాయకులు ఆరోపించారు. సోమవారం పట్టణంలోని ఎన్టీఆర్ చౌరస్తాలో బడ్జెట్ సమావేశ పత్రాలను బహిరంగంగా దహనం చేశారు. ఈ సందర్భంగా విలేకరులతో సీపీఎం ఏరియా కమిటీ సభ్యుడు డాకూరి తిరుపతి మాట్లాడుతూ, దేశంలో 67 శాతం మంది ప్రజలు వ్యవసాయ రంగంపై ఆధారపడి ఉంటే కేంద్ర ప్రభుత్వం మాత్రం ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తోందని మండిపడ్డారు. విద్య, ఉద్యోగ, ఉపాధి, దళితుల అభ్యున్నతికి బడ్జెట్‌లో తక్కువ శాతం కేటాయించడాన్ని తీవ్రంగా విమర్శించారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు చుంచు నారాయణ, గడ్డం రాజేశ్ తదితరులున్నారు.

నాణ్యమైన కరెంటు సరఫరాలో కాంగ్రెస్ విఫలం

- బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు కిరణ్ కొమ్రేవార్

సమావేశంలో మాట్లాడుతున్న బీఆర్ఎస్ నియోజకవర్గ నాయకుడు కిరణ్ కొమ్రేవార్

కుంటాల, ఫిబ్రవరి, 3 : వ్యవసాయానికి నాణ్యమైన విద్యుత్ ఇవ్వడంలో కాంగ్రెస్ ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని బీఆర్ఎస్ ముథోల్ నియోజకవర్గ సమన్వయ కమిటీ సభ్యుడు కిరణ్ కొమ్రేవార్ అన్నారు. సోమవారం ఆయన కుంటాల మండల కేంద్రంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కరెంటు ఎప్పుడు ఉంటుందో, ఎప్పుడు పోతుందో తెలియడం లేదని పంటలకు సకాలంలో నీరు ఇవ్వకపోతే రైతుల రెక్కల కష్టం వృథా అవుతుందన్నారు. మరమ్మతుల పేరిట కుంటి సాకుతో కరెంటు తీసేస్తున్నారని, అందుకే కొన్నిచోట్ల రైతులు సబ్‌స్టేషన్ల వద్ద ధర్నాకు దిగుతున్నారని తెలిపారు. సమావేశంలో బీఆర్ఎస్ మండల కన్వీనర్ పడకంటి దత్తాత్రి, పార్టీ సోషల్ మీడియా జిల్లా కన్వీనర్ ధశరథ్, పార్టీ మండల ఉపాధ్యక్షుడు శ్రీనివాస్, నిగ్వా మాజీ ఎంపీటీసీ దేవీదాస్, అందకూర్ మాజీ సర్పంచ్ దాసరి కిషన్, మాజీ మార్కెట్ కమిటీ డైరెక్టర్ బొంతల పోశెట్టి, తదితరులు పాల్గొన్నారు.

బాధిత కుటుంబాలకు పరామర్శ

కుభీర్, ఫిబ్రవరి 3 : మండల కేంద్రం కుభీర్‌కు చెందిన బీఆర్ఎస్ నాయకుడు కోలేవార్ లక్ష్మణ్ తండ్రి భోజన్న ఇటీవల మృతి చెందారు. విషయం తెలుసుకున్న ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు డాక్టర్ కిరణ్ కొమ్రేవార్ వారి ఇంటికి వెళ్లి కుటుంబ సభ్యులను పరామర్శించారు. అనంతరం బీఆర్ఎస్ మండల నాయకుడు వడ్నం దత్తాత్రి ఇటీవల అనారోగ్యానికి గురికాగా ఆయనను పరామర్శించి యోగక్షేమాలు అడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట బీఆర్ఎస్ మండలాధ్యక్షుడు ఎన్నీల అనిల్, పుప్పాల పీరాజీ, బాల్‌రాజ్, దత్తాత్రి, గిరి పోశెట్టి, దొంతుల దేవీదాస్ తదితరులున్నారు.

దరఖాస్తు గడువు 12 వరకు పొడిగింపు

ఎదులాపురం, ఫిబ్రవరి 3: దివ్యాంగులు జీవనోపాధి పొందాలనే ఉద్దేశ్యంతో రాష్ట్ర ప్రభుత్వం దివ్యాంగులకు ఉపాధి, పునరావాస పథకం ప్రవేశ పెట్టిందని జిల్లా సంక్షేమాధికారి బీ సబిత ఒక ప్రకటనలో తెలిపారు. ఈ పథకం దరఖాస్తు తేదీను ఈనెల 2వ తేదీ చివరి తేదీ ఉండగా ఈ నెల 12వ తేదీ వరకు దరఖాస్తు తేదీలను పొడిగించినట్లు పేర్కొన్నారు. ఈ పథకం కింద బ్యాంకు లింకేజీ లేకుండా నేరుగా రూ.50 వేల సబ్సిడీ అందుబాటులో ఉందని తెలిపారు. 2024-25 ఆర్థిక సంవత్సరానికి ఈ పథకం కింద జిల్లాకు 21 యూనిట్లు మంజూరయ్యాయని పేర్కొన్నారు. లబ్ధిదారుల ఎంపిక ఆన్‌లైన్ ద్వారా జరుగుతుందన్నారు. అర్హులైన దివ్యాంగులు ఈ పథకం కింద లబ్ధిపొందడానికి ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాల్సి ఉంటుందన్నారు. దివ్యాంగులు https://tgobmms.cgg.gov.in వెబ్‌సైట్‌లో దరఖాస్తులు చేసుకోవాలని కోరారు.

బాలుడి అదృశ్యం

బేల, ఫిబ్రవరి 3 : మండలంలోని కొబ్బుయి గ్రామానికి చెందిన బాలుడు అదృశ్యమయ్యాడని, ఈమేరకు కేసు నమోదైనట్లు పోలీసులు తెలిపారు. ఎస్ఐ దివ్యభారతి తెలిపిన వివరాల ప్రకారం, గ్రామానికి చెందిన కాడే మోరేశ్వర్ కుమారుడు రోషన్ ఈనెల 21న ఇంటి నుంచి ఆదిలాబాద్‌కి వెళ్లి తిరిగి రాలేదు. బంధువులు, చుట్టుపక్కల గ్రామాలకు వెళ్లి వెతికినా జాడ తెలియరాలేదు. తండ్రి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్ఐ పేర్కొన్నారు.

మద్యానికి బానిసై యువకుడి ఆత్మహత్య

ఉట్నూర్ రూరల్, ఫిబ్రవరి 3: తాగుడుకు బానిసై యువకుడు దూలానికి ఉరి వేసుకొని ఆత్మహత్య చేసుకున్నాడు. ఎస్ఐ మనోహర్ తెలిపిన వివరాల ప్రకారం, మండలంలోని దొంగచింత గ్రామ పంచాయతీ పరిధిలోని భీంజీగూడ గ్రామానికి చెందిన తొడసం భీంరావు(24)కు నాలుగు సంవత్సరాల క్రితం పెళ్లి అయింది. మద్యానికి బానిసైన భీంరావు తరచూ ఇంట్లో గొడవపడుతూ భార్యను కొట్టేవాడు. గత శనివారం భార్య సీతాబాయిని మద్యం తాగి కొట్టడంతో ఆమె పుట్టింటికి వెళ్లిపోయింది. ఈ క్రమంలో భీంరావు సోమవారం మద్యం మత్తులో ఇంట్లో దూలానికి ఉరివేసుకొని ఆత్యహత్య చేసుకున్నాడు. భార్య సీతాబాయి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్ఐ పేర్కొన్నారు.

ద్విచక్రవాహనం చోరీ

ఎదులాపురం, ఫిబ్రవరి 3 : ఇంటి ఎదుట పార్కింగ్ చేసిన ద్విచక్ర వాహనం చోరీకి గురైందని వన్‌టౌన్ సీఐ బీ సునీల్ కుమార్ తెలిపారు. ఆదిలాబాద్ పట్టణంలోని రవీందర్‌నగర్‌కు చెందిన ఐసీడీఎస్‌లో పనిచేస్తున్న పీ రాజేశ్వర్ ఆదివారం ఉదయం ఇంటి ఎదుట తన వాహనాన్ని పార్కింగ్ చేసి ఉంచాడు. రాత్రి ఇంట్లో పార్కింగ్ చేద్దామని వాహనం చూడగా అక్కడ కనిపించలేదు. చుట్టుపక్కల వెతికినా వాహనం కనిపించలేదు. దీంతో సోమవారం వన్ టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. రాజేశ్వర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ తెలిపారు.

'సీనియర్ సిటిజన్‌లకు ప్రత్యామ్నాయ భవనం కేటాయించాలి'

ఎదులాపురం, ఫిబ్రవరి 3 : సీనియర్ సిటిజన్‌లకు ఏదైనా ప్రభుత్వ ప్రత్యామ్నాయ భవనం కేటాయించాలని దళిత సంఘాల నాయకులు కలెక్టర్ రాజర్షి షానుకోరారు. సోమవారం అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి ఆధ్వర్యంలో కైలాస్ నగర్‌లోని నూతన అంబేద్కర్ భవన్‌లో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, అంబేద్కర్ భవనం ఎదుట ఖాళీ స్థలం పార్కింగ్ కోసం భవిష్యత్తులో సభలు సమావేశాలు పెట్టుకోవడానికి ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. ఈ సమావేశంలో అంబేద్కర్ సంఘాల ఐక్య పోరాట సమితి జిల్లా అధ్యక్షులు అల్లూరి భూమన్న, ప్రధాన కార్యదర్శి దర్శనాల నాగేశ్, అగ్గిమల్ల గణేశ్, రత్నపురి రమేశ్, కుమ్మరి సత్యనారాయణ, హర్ష రమేశ్, నిమ్మల ప్రశాంత్, దేవతడి నామ్‌దేవ్, సందీప్ దాండియా, శశికాంత్, క్రాంతి కుమార్ పాల్గొన్నారు.

సరిపడా బస్సుల్లేక భక్తుల ఇబ్బందులు

బస్సు వద్ద ప్రయాణికుల రద్దీ

బాసర, ఫిబ్రవరి 3 : బాసర సరస్వతీ అమ్మవారి జన్మదిన ఉత్సవాలయిన వసంత పంచమి ఉత్సవాల్లో భాగంగా సోమవారం వసంత పంచమి పర్వదినాన్ని పురస్కరించుకొని అమ్మవారి దర్శనానికి రాష్ట్రంలోని నలు మూలలతో పాటు పక్కన ఉన్న మహారాష్ట్ర, కర్ణాటక, ఆంధ్రప్రదేశ్ నుంచి భక్తులు అధిక సంఖ్యలో తరలివచ్చారు. అయితే భక్తులకు సరిపడా బస్సులు లేక పోవడంతో ఇబ్బందులు పడ్డారు. దర్శనం అనంతరం తమ సొంతూర్లకు వెళ్లేందుకు భక్తులు కుస్తీ పడ్డారు. వచ్చిన బస్సుల్లో ఒకేసారిగా అందరూ ఎక్కడంతో తోపులాటలు జరిగాయి. తమ చిన్నారులతో వచ్చిన భక్తులు పిల్లలకు ఇబ్బందులు అవుతున్నాయని ఆవేదన పడ్డారు. అయితే భక్తులు ఎక్కువగా వస్తారని తెలిసి కూడా బస్సుల నడిపే సంఖ్యను పెంచక పోవడమేంటని భక్తులు ప్రశ్నించారు. బాసర ఆలయం వద్ద, బస్టాండ్ వద్ద, రైల్వేస్టేషన్ వద్ద భక్తుల రద్దీ కనిపించింది. బస్సుల కోసం వేచి వేచి భక్తులు అవస్థలు పడ్డారు.

డ్రైనేజీలో పేరుకుపోయిన పిచ్చిమొక్కలు

పూడిక తీయకపోవడంతో డ్రైనేజీలో నిలిచిన మురుగు నీరు

తాంసి, ఫిబ్రవరి 3 : మండలంలోని గోట్కూరి గ్రామ ప్రధాన రహదారి పక్కన నిర్మించిన మురుగు కాలువ పూడిక తీయకపోవడంతో పిచ్చి మొక్కలతో పేరుకుపోయింది. దీంతో కాలువలో నీరు నిల్వ ఉండి దోమలకు ఆవాసంగా మారింది. గ్రామంలో దోమల బెడద ఎక్కువై విష జ్వరాలు ప్రబలుతున్నాయని స్థానికులు ఆరోపించారు. సంబంధిత అధికారులు స్పందించి మురుగు కాలువ పూడిక తీసి సకాలంలో ఫాగింగ్ చేపట్టాలని కోరుతున్నారు

బోరిగాంలో పీఎస్‌బీ అవగాహన



రైతులకు పీఎస్‌బీ బ్యాగులను అందజేస్తున్న ఏవో వికార్ అహ్మద్

సారంగాపూర్, ఫిబ్రవరి 3: మండలంలోని బోరిగాం గ్రామంలో సోమవారం వ్యవసాయ మండలాధికారి వికార్ అహ్మద్ పీఎస్‌బీపై రైతులకు జీవన ఎరువుల గురించి అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైతులు పీఎస్‌బీ (భాస్వరాన్ని కరింగే బాక్టీరియా) ఉపయోగించడం వల్ల భూమిలో ఉన్న భాస్వరాన్ని మొక్కకు అందించే ప్రక్రియ వేగవంతంగా జరుగుతుందన్నారు. పీఎస్‌బీ మండల వ్యవసాయశాఖ కార్యాలయంలో అందుబాటులో ఉన్నాయన్నారు. రైతులు వీటిని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. ఇక్కడ ఏఈవో ఉమేష్, రైతులున్నారు.

రెడ్డిలు సంఘటితం కావాలి

మాట్లాడుతున్న రాష్ట్ర ఐక్య వేదిక ఉపాధ్యక్షులు పి.నారాయణరెడ్డి

బోథ్, ఫిబ్రవరి 3 : రెడ్డి కులస్తులంతా సంఘటితం కావాలని రెడ్డి సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు నల్ల నారాయణ రెడ్డి, రాష్ట్ర రెడ్డి ఐక్యవేదిక ఉపాధ్యక్షుడు పీ నారాయణరెడ్డి పిలుపునిచ్చారు. సోమవారం బోథ్ మండలంలోని కౌత (బీ) గ్రామంలో రెడ్డి సంక్షేమ భవన ప్రారంభోత్సవంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, గ్రామాల నుంచి రాష్ట్రస్థాయి వరకు రెడ్డి సంక్షేమ సంఘాల బలోపేతానికి కృషి చేస్తున్నామన్నారు. జిల్లా, రాష్ట్ర బాధ్యులను సంఘం సభ్యులు శాలువాలతో సత్కరించారు. కార్యక్రమంలో జిల్లా ప్రధాన కార్యదర్శులు గోపిడి రాంరెడ్డి, యెల్టీ కిష్టారెడ్డి, ఉపాధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, సంఘం అధ్యక్షుడు సింగడి పురుషోత్తం రెడ్డి, గ్రామాభివృద్ధి కమిటీ అధ్యక్షుడు శ్రీకాంత్ రెడ్డి, వినాయక్ రెడ్డి, మురళీమనోహర్ రెడ్డి, నర్సింహారెడ్డి, రాంరెడ్డి, రమణారెడ్డి, బబ్బు, సంఘం సభ్యులున్నారు.

యువత సంయుక్త కార్యదర్శిగా సాయి కిరణ్ రెడ్డి

బోథ్ మండలంలోని కౌత(బీ) గ్రామానికి చెందిన ఇట్టడి సాయి కిరణ్ రెడ్డి, రెడ్డి ఐక్యవేదిక జిల్లా యువత సంయుక్త కార్యదర్శిగా నియామకమయ్యారు. జిల్లా అధ్యక్షుడు నారాయణ రెడ్డి, ఐక్యవేదిక రాష్ట్ర ఉపాధ్యక్షుడు పొద్దుటూరు నారాయణరెడ్డి చేతుల మీదుగా నియామక పత్రాన్ని అందుకున్నారు. ఇక్కడ రెడ్డి సంక్షేమ సంఘం సభ్యులు, నాయకులున్నారు.

అక్షర చిట్ ఫండ్ యాజమాన్యంపై కేసు

ఎదులాపురం, జనవరి 3 : అక్షర చిట్ ఫండ్ యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు టూ టౌన్ సీఐ సిహెచ్ కరుణాకర్ రావ్ తెలిపారు. జైనథ్ మండలంలోని బాలాపూర్‌కు చెందిన జక్కుల రమేశ్ జిల్లా కేంద్రంలోని అక్షర చిట్ ఫండ్‌లో రూ.10 లక్షల చిట్టి కట్టాడు. 20 నెలల పాటు చిట్టి డబ్బులు చెల్లించాడు. నిర్మల్‌లో అక్షర చిట్ ఫండ్ బ్రాంచ్ మూసివేసినట్లు తెలుసుకున్న ఆయన ఆ తర్వాత చిట్టి డబ్బులు చెల్లించలేదు. ఇదివరకు కట్టిన డబ్బులు తిరిగి చెల్లించాలని ఇటీవల యాజమాన్యంతో మాట్లాడాడు. రూ.5 లక్షల బాండ్ డిపాజిట్ చేయాలని, అదనంగా రూ.1లక్ష 60వేలు ఇస్తామని అక్షర చిట్ ఫండ్ నిర్వాహకులు చెప్పినట్లు పేర్కొన్నారు. దీంతో ఆయన భార్య పేరిట బాండ్ ఇచ్చినట్లు తెలిపారు. బాధితుడికి రూ.80వేలు మాత్రమే ఇచ్చారని, మిగితా డబ్బులు ఇచ్చేందుకు రేపుమాపు అంటూ ఇబ్బందులకు గురిచేయడంతో ఆయన టూ టౌన్‌లో ఫిర్యాదు చేశాడు. దీంతో కేసు నమోదు చేసినట్లు సీఐ వివరించారు.

కారు బోల్తా : విశ్రాంత ఉపాధ్యాయుడి మృతి

వెంకట్‌రెడ్డి (ఫైల్)

నేరడిగొండ, ఫిబ్రవరి 3 : మండలంలోని ఆదిలాబాద్-నిర్మల్ రహదారిపై నారాయణపూర్ గ్రామ సమీపంలో కారు బోల్తాపడగా విశ్రాంత ఉపాధ్యాయుడు నోముల వెంకట్ రెడ్డి(65) మృతి చెందాడు. ఆయన కుమారుడు శరత్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. స్థానికులు, పోలీసుల వివరాలిలా ఉన్నాయి. బోథ్ మండలం కౌత (బీ) గ్రామానికి చెందిన తండ్రీ కొడుకులు వెంకట్‌రెడ్డి, శరత్‌రెడ్డి కౌతకు వచ్చి నిర్మల్‌కు తిరిగి కారులో వెళ్తున్నారు. నారాయణపూర్ వద్ద టైరు పగలడంతో ముందు వెళ్తున్న కారును బలంగా ఢీకొని బోల్తా పడింది. అందులో ప్రయాణిస్తున్న వెంకట్‌రెడ్డికి తలకు తీవ్ర గాయాలుకాగా, శరత్‌రెడ్డికి స్వల్ప గాయాలయ్యాయి. వెంటనే నిర్మల్ దవాఖానకు తరలించగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ముందు వెళ్తున్న కారు రోడ్డు కిందకు దిగిపోగా అందులో ప్రయాణిస్తున్న వారికి ఎలాంటి గాయాలు కాలేదు. నేరడిగొండ ఎస్ఐ శ్రీకాంత్ ఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు.

కంప్యూటర్ సెంటర్ ప్రారంభం

కంప్యూటర్ సెంటర్‌ను ప్రారంభిస్తున్న వీసీ

బాసర, ఫిబ్రవరి 3 : ఆర్జీయూ కేటీలో పీయూసీ విద్యార్థినుల కోసం కంప్యూటర్ సెంటర్‌ను సోమవారం ఓఎస్‌డీ ప్రొఫెసర్ మురళీదర్శణ్‌తో కలిసి వీసీ ప్రొఫెసర్ గోవర్ధన్ ప్రారంభించారు. కొత్త కంప్యూటర్ సెంటర్‌లో ఆధునిక కంప్యూటింగ్ సౌకర్యాలు, హైస్పీడ్ ఇంటర్నెట్, ప్రత్యేక సాఫ్ట్‌వేర్ విద్యార్థినుల అకడమిక్, రీసెర్చ్ అవసరాలకు అనుగుణంగా ఉన్నాయన్నారు. డిజిటల్ విభజనను తగ్గించడం, సాంకేతిక రంగాల్లో బాలికల విద్యను ప్రోత్సహించే ప్రాముఖ్యతను తెలిపారు. కార్యక్రమంలో అసోసియేట్ డీన్ డాక్టర్ విఠల్, డాక్టర్ మహేశ్, డాక్టర్ చంద్రశేఖర్, వివిధ విభాగాల అధికారులు విద్యార్థులు పాల్గొన్నారు.

యువత అన్ని రంగాల్లో రాణించాలి

ఖండోవ్‌లో క్రికెట్ టోర్నమెంట్ పోటీలను ప్రారంభించిన ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి పెందోర్ సంతోష్

నార్నూర్, ఫిబ్రవరి 3 : ఆదివాసీ యువత అన్ని రంగాల్లో రాణించాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల ప్రధాన కార్యదర్శి పెందోర్ సంతోష్ కోరారు. సోమవారం గాదిగూడ మండలం ఖండోవ్ గ్రామంలో శ్రీ కృష్ణ యూత్ అసోసియేషన్ ఆధ్వర్యంలో నిర్వహించిన క్రికెట్ పోటీలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, క్రీడలు స్నేహభావాలను పెంపొందిస్తాయన్నారు. ఆదివాసీ యువత చెడు వ్యసనాలకు దూరంగా ఉంటూ ఉన్నత చదువులతో ప్రయోజకులు కావాలన్నారు. అప్పుడే సమాజంలో మంచి గుర్తింపు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చంద్రహరి, మాజీ ఎంపీటీసీ కిరణ్, బోపతి పటేల్, బాధిరావు, మోతీరాం, మాన్కు, యూత్ సభ్యులు మోపత్, సోము, క్రీడాకారులు పాల్గొన్నారు.

రాజకీయ పార్టీల నాయకులతో కలెక్టర్ సమావేశం

ఎదులాపురం, ఫిబ్రవరి3: తెలంగాణ గ్రాడ్యుయేట్, టీచర్స్ నియోజకవర్గాల శాసన మండలి ఎన్నికలకు సంబంధించి సోమవారం కలెక్టర్ రాజర్షి షా, అదనపు కలెక్టర్ శ్యామలాదేవితో కలిసి కలెక్టరేట్ సమావేశ మందిరంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీ ప్రజాప్రతినిధులు, నోడల్ అధికారులతో సమావేశం నిర్వహించారు. అనంతరం పశు సంవర్ధక శాఖ 2025 సంవత్సరం డైరీలను కలెక్టర్ రాజర్సి షా ఆవిష్కరించారు.

గంగపుత్ర సంఘ భవనం ప్రారంభం

ఖానాపూర్, ఫిబ్రవరి 3: ఖానాపూర్ పట్టణంలో మత్స్యశాఖ నిధులు రూ.10 లక్షలతో నిర్మించిన గంగపుత్ర సంఘ భవనం ప్రారంభోత్సవానికి సోమవారం బీఆర్ఎస్ ఖానాపూర్ నియోజకవర్గ ఇన్‌చార్జి భుక్యా జాన్సన్ నాయక్ ముఖ్య అతిథిగా హాజరై ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మత్స్యకారులు అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. బీఆర్ఎస్ హయాంలో మత్స్యకారుల అభివృద్ధికి బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్ అనేక నిధులు కేటాయించారని గుర్తు చేశారు. ఆయన వెంట నాయకులు రాజగంగన్న, రాజు, సురేశ్, చంద్రవాస్ గంగపుత్ర సంఘ నాయకులున్నారు.

పొంచి ఉన్న ప్రమాదం

విద్యుత్తు అధికారుల నిర్లక్ష్యం.. ప్రజలకు శాపంగా మారింది. విద్యుత్ స్తంభాలు, తీగలకు చెట్లు, మొక్కలు అల్లుకొని ప్రమాదకరంగా మారాయి. ముజ్గి గ్రామంలో ప్రధాన రోడ్డు పక్కన విద్యుత్ స్తంభాలు, తీగలకు మొక్కలు అల్లుకొన్నాయి. ప్రమాదం పొంచి ఉన్నా అధికారులు పట్టించుకోవడంలేదనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

-నిర్మల్ ఫొటోగ్రాఫర్, ఫిబ్రవరి 3